సాక్షి ఒడిశా
శనివారం । 3 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,40,865
బంగారం	50 మిల్లీ గ్రాములు
వెండి	61 గ్రాముల 380 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

14 మందికి యావజ్జీవ శిక్ష



పర్లాకిమిడి పట్టణంలోని ఒకటో వార్డు గాసి వీధిలో జరిగిన హత్యా కేసుకు సంబంధించి 15 ఏళ్ల తర్వాత కోర్టు తుది తీర్పును శుక్రవారం ఇచ్చింది.

- 8లో

మలేరియాతో విద్యార్థి మృతి



రాయగడ జిల్లాలోని కొలనర సమితి భోయి ముడ ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న జాక్సన్ మండంగి(9) అనే విద్యార్థి మలేరియాతో మృతి చెందాడు.

- 8లో

న్యూస్‌రీల్

'వైద్యుల పోస్టులు భర్తీ చేయండి'



వైద్యశాఖ మంత్రి ముఖేష్‌తో ఎమ్మెల్యే సత్యజీత్

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని రాష్ట్ర ఆరోగ్య, వైద్య శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్‌కు శుక్రవారం అందజేశారు. రాజధాని భువనేశ్వరలో ప్రత్యేకంగా మంత్రిని కలిసి వివిధ సమస్యలను అతని దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా సబ్ డివిజన్ ఆస్పత్రిలో వైద్యుల కొరత కారణంగా మెరుగైన వైద్య సేవలను ప్రజలు పొందలేకపోతున్నారని వివరించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు లేకపోవడంతో చిన్న రోగానికైన ఇతర ప్రాంతాలకు రిఫర్ చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై స్పందించిన మంత్రి ఈ విషయమై దృష్టి సారించి వైద్యుల పోస్టుల భర్తీకై ప్రభుత్వంతో సంప్రదించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు సమాచారం.

దక్షిణ ఒడిశాపై బీజేపీ దృష్టి

- అధ్యక్షుడు మన్మోహన్ సామల్



మన్మోహన్‌సామల్‌తో ఆ పార్టీ నాయకులు

కొరాపుట్: దక్షిణ ఒడిశాపై బీజేపీ దృష్టి సారించిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ప్రకటించారు. ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారి కొరాపుట్ జిల్లాకు వచ్చిన సందర్భంగా మీడియాతో శుక్రవారం మాట్లాడారు. ఈ ప్రాంతంలో విద్యా, ఉపాధి, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలియజేశారు. మల్కన్‌గిరి వరకు రైల్వే నిర్మాణం పూర్తి చేయడానికి కృత నిశ్చయంతో ఉన్నామన్నారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు వివాదస్పద ప్రాంతం కొఠియాపై మాట్లాడుతూ కొఠియా ప్రాంతం ఒడిశాదేనని స్పష్టం చేశారు. కొఠియా అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఆయనతో పాటు ఆ పార్టీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి మానస్ మహంతి, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో, కోట్‌పాడ్ ఎమ్మెల్యే రుపుదర్ బోత్ర, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుమంత్ ప్రధాన్‌లు ఉన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య..?



చెట్టుకు వేలాడుతున్న మహేష్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలో మత్తిలి సమితి కోరపల్లి గ్రామంలోని అడవిలో చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని స్థానికులు గురువారం ఉదయం గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మహేష్ నాయిక్ (40) గురువారం సాయంత్రం ఇంటి నుంచి పని ఉందని చెప్పి బయటకు వెళ్లాడు. అయితే ఆయన రాత్రి మరలా ఇంటికి రాకపోవడంతో ఎక్కడో పనిపై ఉండి ఉంటాడని కుటుంబ సభ్యులు అనుకున్నారు. అయితే శుక్రవారం ఉదయం గ్రామస్తులు కొందరు అడవి వైపు కాలకృత్యాలు కోసం వెళ్లగా చెట్టుకు వేలాడుతూ మహేష్ మృతదేహం కనిపించింది. దీంతో అతని కుటుంబ సభ్యులు, మత్తిలి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి హత్యా.. ఆత్మహత్య అనే కోణంలో దర్యాప్తు చేపడుతున్నారు.

- రాష్ట్రంలోని 11 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు
- ఆకాశంవైపు ఆశగా చూస్తున్న రైతులు
- సుందరగడ్‌లో గణనీయంగా తగ్గిన వర్షపాతం

ఆశలన్నీ ఆగస్టుపైనే..!





బాలాసోర్ జిల్లాలో వర్షం కోసం పూజలు చేస్తున్న గ్రామస్తులు

భువనేశ్వర్: రాష్ట్రంలో అల్ప పీడనం ప్రభావంతో ఇటీవల పలుచోట్ల భారీగా వర్షాలు నమోదైనా, అత్యధిక ప్రాంతాల్లో ఇంకా లోటు వర్షపాతం కొనసాగుతోంది. ఈ ఏడాది రుతు పవనాలు రాష్ట్రంలోకి త్వరగా ప్రవేశించినా అక్కరకు రాని పరిస్థితులు తాండవిస్తున్నాయి. ముఖ్యంగా సుందర్‌గడ్ జిల్లాలో ఇటువంటి పరిస్థితి కొనసాగుతోంది. ఈ జిల్లాలో ఈ సీజన్‌లో స్వల్ప వర్షపాతం ఆందోళన కలిగిస్తోంది. రుతు పవనాలు ప్రవేశించిన రెండు నెలల తర్వాత ఈ ఏడాది జూన్, జూలై వరుసగా 2 నెలల్లో అతి తక్కువ వర్షపాతం నమోదు అయింది. గతేడాది ఈ 2 నెలల వర్షపాతం కంటే ఈ ఏడాది గణనీయంగా వర్షపాతం తగ్గింది. 2023 జూన్, జూలై నెలలతో పోలిస్తే ఈ ఏడాది జూన్ నెలలో 42.83 శాతం, జూలైలో 46.11 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో స్వల్ప వర్షపాతం జాబితాలో 4వ స్థానంలో కొనసాగుతుంది. మొదటి మూడు స్థానాల్లో ఝార్సుగుడ, బాలేశ్వర్ మరియు భద్రక్ జిల్లాలు ఉన్నాయి.

గణనీయంగా తగ్గుదల

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం సుందరగడ్ జిల్లాలో ఈ ఏడాది జూలై నెలలో సగటున 352.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవుతుందని ఊహించారు. కానీ వాస్తవ వర్షపాతం 189.8 మిల్లీ మీటర్లకు (53.88 శాతం) పరిమితమైంది. గతేడాది జూలై నెలలో 310.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఈ ఏడాది జూన్ నెలలో కూడా వర్షపాతం గతేడాది కంటే గణనీయంగా దిగజారింది. సుందరగడ్ జిల్లాలో సగటు వర్షపాతం 204.3 మిల్లీ మీటర్లు. గత ఏడాది జూన్ నెలలో 228.8 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డు కాగా, ఈ ఏడాది నామమాత్రంగా 116.8 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డు కావడం విచారకరం. ఈ ఏడాది సుందరగడ్ జిల్లా హిమగిరి మండలంలో అత్యధికంగా వర్షపాతం నమోదు కాగా, రౌర్కెలా నగర పాలక సంస్థ పరిధిలో అతి తక్కువగా వర్షపాతం రికార్డైంది.

దిగాలుగా రైతులు

వర్షాలు లేకపోవడంతో సుందరగడ్ జిల్లాలో రైతులు దిగాలుగా ఉన్నారు. ఈ ఏడాది సాగు పనులపై అనిశ్చితి నెలకొందని ఈ వర్గం కలవరపడుతోంది. ఈ ఏడాది వరి సాగుకు తీవ్రనష్టం వాటిల్లే పరిస్థితులు పొంచి ఉన్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆశలన్నీ ఆగస్టుపైనే పెట్టుకున్నారు. ఈ నెలలో వర్షపాతం పుంజుకుంటే వరి పంట కొంత వరకు కుదుటపడే అవకాశం ఉంటుందని ఆశిస్తున్నారు.

గ్రామ దేవతలకు పూజలు

బాలాసోర్ జిల్లాలో కూడ స్వల్ప వర్షపాతం కలవరపెడుతోంది. ఈ జిల్లాలో వర్షం కోసం పలు గ్రామాల్లో గ్రామ దేవతలకు పూజలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా నీలగిరి వనపహాడ్ ఘెరా ప్రాంతంలో రైతులు ఆకాశంవైపు ఆశగా చూస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. వరుణుని కరుణ కోసం గ్రామస్తులు అమ్మవారిని శరణు వేడుకుంటున్నారు. కొండ కోనల్లో అడవి దేవతకు పూజార్చనలు చేపడుతున్నారు. బాలాసోర్ జిల్లా నీలగిరి స్వర్ణచూడ కొండపై బఘుమొరా అమీన్‌కొంథా ప్రాంతంలో కొలువైన సుందరాసుణి అమ్మవారికి వర్షం కురిపించాలని పూజార్చనలు చేస్తున్నారు. తప్పకుండా అమ్మవారు అనుగ్రహిస్తుందని విశ్వసిస్తున్నారు. అనావృష్టి తాండవించకుండా నింగి నుంచి వర్షపు బొట్టు రాల్చి తమను ఆదుకోవాలని గ్రామస్తులంతా ఉమ్మడిగా కొండపైకి చేరుకుని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజాదులు నిర్వహిస్తున్నారు.

11 జిల్లాల్లో స్వల్ప వర్షపాతం

వాతావరణ శాఖ సమాచారం ప్రకారం ప్రస్తుతం 11 జిల్లాల్లో స్వల్ప వర్షపాతం పరిస్థితులు కొనసాగుతున్నాయి. ప్రస్తుత వర్షాకాలంలో జూన్ 1 నుంచి రాష్ట్రంలో సమగ్రంగా 507.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో మల్కన్‌గిరి జిల్లాలో మాత్రమే సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు అయింది. మరో 3 జిల్లాల్లో సాధారణం కంటే స్వల్పంగా అధిక వర్షపాతం రికార్డు అయింది. 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, మిగిలిన 11 జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వివరించింది.

అమ్మవార్లకు ఆషాడం సారె సమర్పణ



ర్యాలీతో సారె తీసుకెళ్తున్న భక్తులు



మజ్జిగౌరికి భక్తులు సమర్పించిన ఆషాఢం సారె

రాయగడ: పట్టణం సుభిక్షంగా ఉండడంతో పాటు సక్రమంగా వర్షాలు కురిసి రైతన్నలు ఆనందంగా ఉండాలని కోరుతూ గ్రామదేవత బురదల పోలమ్మ, ప్రజల కోర్కెలు తీర్చే చల్లని తల్లి మజ్జిగౌరి అమ్మవార్లకు స్థానిక బుదరావలస మూడోలైన్‌కు చెందిన మహిళలు శుక్రవారం ఆషాడం సారె సమర్పించారు. ఆ ప్రాంతానికి చెందిన సుమారు రెండు వందల మందికిపైగా మహిళలు తలలపై సారె బుట్టలను మోసుకుంటూ మందిరాలకు వెళ్లారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ఇష్టమైన చీర, గాజులు, సింధూరం, బంగారంతో రూపొందించిన పుస్తెలు, పసుపు, కుంకుమలతో పాటు వివిధ రకాల స్వీట్లు, పండ్లు నైవేద్యాలుగా సమర్పించారు. ప్రతీ ఇంటి నుంచి ఒకొక్క మహిళ తాము తయారు చేసి స్వీట్లు, బూరెలను తీసుకొచ్చి అమ్మవారి సన్నిధిలో ఉంచారు. ఆలయ అర్చకులు కేదార్ బెరుకొ అమ్మవారి ప్రాంగణంలో భక్తులు తీసుకొచ్చే నైవేద్యాలను దేవతకు సమర్పించారు. పూజా కార్యక్రమాలు పూర్తైన తర్వాత ఆ ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు.

'పనులు త్వరితగతిన పూర్తి చేయాలి'



మున్సిపల్ చైర్మన్, ఇంజినీర్లతో మాట్లాడుతున్న తిరుపతి పాణిగ్రాహి తదితరులు

పర్లాకిమిడి: స్థానిక పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డుల్లో కుంటుపడిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బీజేడీ సీనియర్ నాయకులు తిరుపతి పాణిగ్రాహి, మాజీ ఎమ్మెల్యే కెంగం సూర్యారావు, ఇతర కౌన్సిలర్లు పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠిని శుక్రవారం కలిసి కోరారు. ఈ సందర్భంగా పురపాలక సంఘం చైర్మన్ చాంబర్‌లో ఇంజినీర్లు, ఈవోలతో చర్చించారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు పాతపట్నం మండలంలో పి.గోపాలపురం వద్ద డంపింగ్ అవుతున్న చెత్తను నిర్మూలించడానికి కాంక్రీట్‌తో కాలువ నిర్మాణం, సరిహద్దులో చెత్త రీసైక్లింగ్ ప్లాంటు నిర్మాణం, సీసీ రోడ్డు నిర్మాణంపై మాజీ ఎమ్మెల్యే కెంగం సూర్యారావు, కౌన్సిలర్లు నిలదీశారు. మొత్తం 11 వందల మీటర్ల డ్రైనేజీ, రీసైక్లింగ్ ప్లాంటు నిర్మాణానికి రూ.6.40 కోట్లకు అంచనాలు రూపొందించామని, త్వరలో టెండర్లు పిలుస్తామని మున్సిపల్ అధికారులు తెలియజేశారు. అలాగే శంకర్ బాస్ చెరువు గట్టు నిర్మాణం, పట్నాయిక్ చెరువు పనులు అప్పగింతపై సమీక్షించారు. మున్సిపల్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న పనులపై ప్రజలకు తెలిసేలా అంచనాల వ్యయం, పనుల పట్టికను డిస్‌ప్లే బోర్డు పెట్టించాలని కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురు అరెస్టు



అరెస్టైన బైక్ డ్రైవర్ రాజు హరిజన్



అరెస్టైన చటుర్ లాల్



వ్యాన్ డ్రైవర్ దాము బాగేల్

జయపురం: సమితి పరిధి అంబాగుడ శీతల గిడ్డంగుల ఆర్టీసీ సిబ్బంది, జయపురం సదర్ పోలీసుస్టేషన్ పోలీసులు కలిసి వాహన తనిఖీలను గురువారం సాయంత్రం నిర్వహించారు. దీనిలో భాగంగా మద్యం సేవించి వ్యాన్ నడుపుతున్న ఒక వ్యక్తిని, నాటుసారా తాగి బైక్‌పై వస్తున్న ఒక వ్యక్తిని, అతడి వెనుక కూర్చున్న మరో తాగుబోతుని జయపురం సదర్ పోలీసులు అరెస్టు చేశారు. బైక్‌పై వస్తున్న వ్యక్తితో పాటు అతడి వెనుక కూర్చున్న వ్యక్తి పోలీసులను తిడుతూ బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తించారని జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్రతండి వెల్లడించారు. అరెస్టైనవారిలో సనమండాపాదర్ రాజు హరిజన్, హరడపుట్ గ్రామానికి చెందిన కె.సి.చటుర్ లాల్‌లు, వ్యాన్ నడుపుతున్న డ్రైవర్ దాము బాగేల్ ఉన్నట్లు వెల్లడించారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు.

131 కేజీల గంజాయి పట్టివేత



బొయిపరిగుడలో స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ సిబ్బంది



గుంజిగుడ గ్రామ సమీపంలో పట్టుబడిన నిందితుడితో సిబ్బంది

జయపురం: స్థానిక ఎక్సైజ్ సిబ్బంది రెండు చోట్ల దాడులు నిర్వహించి 131 కేజీల గంజాయి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఒక వ్యక్తిని అరెస్టు చేశామని, మరో వ్యక్తి తమను చూచి పరారయ్యాయడని ఎక్సైజ్ డీఎస్పీ స్వాగతిక మహంతి శుక్రవారం వెల్లడించారు. వారు తెలిపిన తెలిపిన వివరాల మేరకు.. డీఎస్పీ స్వాగతిక మహంతి నేతృత్వంలో జయపురం, బొయిపరిగుడ ఎక్సైజ్ సిబ్బంది పురాణపాణి గ్రామ సమీపంలోని ఒక గృహంలో దాడులు నిర్వహించగా గంజాయి బయటపడింది. ఆ ఇంటిలో పది పాలిథిన్ సంచుల్లో ఉంచిన గంజాయిని సిబ్బంది సీజ్ చేశారు. వాటిని తూయించగా 105 కేజీల గంజాయి ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంటిలో గంజాయి దాచిన లక్ష్మణ ఖోర పారిపోయాడని వెల్లడించారు. ప్రస్తుతం అతడిని పట్టుకునేందుకు గాలిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే జయపురం ఎక్సైజ్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ శశికాంత దాస్ నేతృత్వంలో గురువారం మధ్యాహ్నం గుంజిగుడ గ్రామం సమీపంలో ఒక బైక్‌పై తీసుకెళ్తున్న 26 కేజీల గంజాయి పట్టుబడిందని వెల్లడించారు. గంజాయిని దొంగతనంగా తీసుకెళ్తున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అతడు మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసుస్టేషన్ కుడుములగుమ్మ గ్రామానికి చెందిన జితేంద్ర రౌత్‌గా తెలిపారు. దాడుల్లో బొయిపరిగుడ ఎక్సైజ్ అధికారి భగవాన్ మహానందియ, జయపురం అధికారి నీటాద్రి బిహారి బిశాయి, ఏఎస్ఐ ఎం.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

యూపీ నుంచి బంగాళదుంపల దిగుమతి



వ్యాపారులతో మాట్లాడుతున్న మంత్రి కృష్ణచంద్ర పాత్రో

భువనేశ్వర్: రాష్ట్రంలో బంగాళ దుంపల సంక్షోభాన్ని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్తరప్రదేశ్ నుంచి రాష్ట్రానికి బంగాళ దుంపలు దిగుమతికి ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో అధ్యక్షతన లోక్‌సేవా భవన్‌లో సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో విభాగం ప్రముఖ కార్యదర్శి వీర్ విక్రమ్ యాదవ్, విభాగం సీనియర్ అధికారులు, ఒడిశా వ్యాపారుల సంఘం ప్రధాన కార్యదర్శి సుధాకర్ పండా మరియు వివిధ యూనియన్ల కార్మికులు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కృష్ణ చంద్ర పాత్రో మాట్లాడుతూ బంగాళ దుంపల విషయంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఏకపక్ష చర్యలకు నిరసనగా, ఉత్తరప్రదేశ్ నుంచి బంగాళ దుంపలను రాష్ట్రానికి తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. గురువారం రాష్ట్రానికి కొన్ని ట్రక్కుల బంగాళదుంపలు వచ్చాయని, రానున్న రోజుల్లో మరిన్ని సరుకులు రానున్నాయన్నారు. దీంతో బంగాళ దుంపల కోసం పశ్చిమ బెంగాల్‌పై ఆధారపడడం క్రమంగా తగ్గుతుందని పేర్కొన్నారు. దీనికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని మంత్రి తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రతినిధి బృందం త్వరలో ఉత్తరప్రదేశ్‌లో పర్యటించనుందన్నారు. ఒడిశా సమగ్రతను కాపాడేందుకు పొరుగు రాష్ట్రాలపై, బంగాళ దుంపలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో బంగాళ దుంపలు, ఇతర వస్తువుల ఉత్పత్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒడిశా వ్యాపారవేత్తలు మరియు వివిధ సంఘాల అభ్యర్థనల మేరకు ప్రభుత్వం ఉత్తర ప్రదేశ్ నుంచి బంగాళాదుంపలను తీసుకురావడానికి చర్యలు తీసుకుందని మంత్రి తెలియజేశారు.

బంతిపూల సాగుపై ఆసక్తి కనబర్చాలి

- రాయగడ కలెక్టర్ మహాజన్



మహిళలతో కలిసి బంతినార నాటుతున్న కలెక్టర్



మిషన్ శక్తి మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ మహాజన్

రాయగడ: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు బంతి పూల సాగుపై ఆసక్తి కనబర్చాలని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ సూచించారు. జిల్లాలోని కొలనార సమితి డిమిరిగుడ గ్రామ పంచాయతీలోని డెంగ్‌సర్గీ గ్రామంలో ఒడిశా జీవికా మిషన్ ఆధ్వర్యంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో మిషన్ శక్తి మహిళలతో గురువారం సాయంత్రం ఆయన మాట్లాడారు. శ్రావణ మాసంలో పూజా కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతాయని, దీని దృష్ట్యా ఆ సమయంలో మంచి గిరాకీ ఉండే బంతి సాగు చేపడితే అధిక లాభాలు ఆర్జించవచ్చన్నారు. ఒడిశా జీవికా మిషన్ ఆధ్వర్యంలో డిమిరిగుడ, బొడొఖిల్లాపాదొరొ, బంకిలి, గడిశిఖాల్, ఖెదపడ, కొలనార, ముకుందపూర్ తదితర గ్రామాల్లో బంతి నారను ఉచితంగా పంపిణీ చేశారు.

క్లుప్తంగా

విద్యుత్ వినియోగదారుల అవగాహన ర్యాలీ



విద్యుత్ వినియోగంపై ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

జయపురం: స్థానిక టాటా పవర్ దక్షిణ ఒడిశా డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్ సభ్యులు విద్యుత్ వినియోగదారుల అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. పట్టణంలోని టాటా పవర్ దక్షిణ ఒడిశా సప్లయ్ లిమిటెడ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయం నుంచి బయల్దేరిన ర్యాలీ తరణీ కూడలి వరకు సాగింది. ఈ ర్యాలీని విద్యుత్ విభాగ సురక్షా అధికారి ప్రమోద్ కుమార్ బెహర జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో సౌమ్యరంజన్ లెంక, మోహర్ సాహు, సంతోష్ పుష్టి, రాజేష్ త్రిపాఠీ, హిమాంశు నాయిక్, రాజ కుమార్, రోషన్ సాహు, జ్ఞాన రంజన్ రౌత్ తదితరులు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశం నిర్వహణ



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సచిన్ తదితరులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి కలెక్టర్ సచిన్ పవార్ అధ్వర్యంలో సన్నాహక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆగస్టు 11వ తేదీ నుంచి స్థానిక డీఎన్‌కే క్రీడా మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించేందుకు నిర్ణయించారు. చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలకు సంబంధించి చర్చించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వేద్బార్ ప్రధాన్, సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, సీడీఎంవో ధనేశ్వర్ మహపాత్రో, డీఐపీఆర్వో ప్రమిళా మాఝి, మల్కన్‌గిరి తహసీల్దార్ లలిత్ బాగ్ పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ లీక్

టెక్కలి రూరల్: స్థానిక గోపినాథపురంలో వీరఘట్టం శివప్రసాద్ అనే వ్యక్తి ఇంట్లో శుక్రవారం వేకువజామున వంటలు చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ పైపులైన్ లీకై మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపకాధికారి (ఎస్ఎఫ్ఓ) బి.సూర్యారావు, సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని విశాఖ-బి కాలనీలో షిర్డీసాయి ఆలయ సమీపంలో నివాసముంటున్న జామి చందన (30) శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె భర్త జామి శ్రీను చిరు వ్యాపారి. వీరికి కుమారుడు దేవిశ్రీప్రసాద్, కుమార్తె హారిక ఉన్నారు. చందన కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తోందని, అనారోగ్య సమస్యలు కూడా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్ఐ వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

604 మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం

కాశీబుగ్గ/వజ్రపుకొత్తూరు రూరల్: మందస మండలం బేతాళపురం గ్రామానికి చెందిన పుక్కళ్ల దిలీఫ్, చెల్లూరి వెంకటేష్‌లు అక్రమంగా తరలిస్తున్న 604 మద్యం టెట్రా ప్లాకెట్లను ఎస్ఈబీ పోలీసులు పట్టుకున్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఎంఆర్‌పీ అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం మందస, పలాస, కాశీబుగ్గ పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం నుంచి మందస వైపు 90 ఎంఎల్ పరిమాణం 460 మద్యం టెట్రా ప్యాకెట్లు, మరో 180 ఎంఎల్ పరిమాణం గల 144 మద్యం టెట్రా ప్యాకెట్లు తరలిస్తున్నట్లు గుర్తించారు.

కొట్లాటలో విద్యార్థికి గాయాలు

పొందూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పమ్మిన ధనుంజయ, వి.వెంకటరమణల మధ్య కొట్లాట చోటు చేసుకుంది. ఈ ఘటన లో ధనుంజయకు చేయి విరగడంతో ఆసుపత్రి పాలయ్యాడు. మూడు రోజుల కిందట జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. తరగతి గదిలో పుస్తకాల విషయంలో వివాదం జరిగిందని చెబుతున్నారు. ఇంటర్వెల్ సమ యంలో మూత్ర విసర్జనకు జయటకు వెళ్లిన సమయంలో గొడవ మరింత పెరగడంతో ఈ కొట్లాట చోటుచేసుకుంది. పాఠశాలలో తరచూ గొడవలు జరుగుతున్నా హెచ్ఎం దృష్టి సారించడం లేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. నాడు-నేడు పనుల్లో మరుగుదొడ్లు నిర్మించినా అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థులు మూత్ర విసర్జనకు బయటకు వెళ్లాల్సి వస్తోందని, అందుకే ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





మ్యాజిక్ షో దృశ్యాలు

ఆకట్టుకున్న మ్యాజిక్ షో

రాయగడ: స్థానిక అశోక్ కల్యాణ మండపంలో జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ఆర్థిక సాయంతో నిర్వహించిన మ్యాజిక్ షో ఆకట్టుకుంది. జిల్లా పౌర సంబంధాల, సమాచార శాఖ అధికారి బసంతకుమార్ ప్రధాన్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి తరహా వినోద కార్యక్రమాలు ఇటీవల కనుమరుగవుతుండడం బాధాకరమన్నారు. కళాకారులు, కళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం రెడ్‌క్రాస్ నిధుల నుంచి ఆర్థిక సహకారం అందించి ఈ షో నిర్వహిస్తోందని పేర్కొన్నారు. కళాకారులను ప్రోత్సహించడమే దీని ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.



ప్రసంగిస్తున్న బసంతకుమార్ ప్రధాన్

14 మందికి యావజ్జీవ శిక్ష



వివరాలు వెల్లడిస్తున్న పీపీ బృందావన్ నాయక్

పర్లాకిమిడి: పట్టణంలోని ఒకటో వార్డు గాసి వీధిలో జరిగిన హత్యా కేసుకు సంబంధించి 15 ఏళ్ల తర్వాత కోర్టు తుది తీర్పును శుక్రవారం ఇచ్చింది. దీనిలో భాగంగా 14 మంది నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ప్రభుత్వ పీపీ బృందావన్ నాయక్ తెలిపిన వివరాల మేరకు.. 2009 మార్చి 12వ తేదీన హోలీ సందర్భంగా పాతకక్షల నేపథ్యంలో గాసివీధిలోని ఒకటో వార్డులో పలువురు ఇళ్లపై అదే వీధికి చెందిన కొంతమంది రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో నాగబంస చినబాబు, బాబి గుర్రాలు, నాగబంస శివలకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ నాగబంస శివ మృతి చెందాడు. దీంతో ఆ ప్రాంతానికి చెందిన పొన్నాడ శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు హత్యాయత్నం, హత్య కేసులు నమోదు చేసి 16 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుపై న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెల్లడించింది. 16 మంది నిందితుల్లో నాగబంస భాస్కర్, జంగం హరినాథ్ ఇప్పటికే మృతి చెందారు. మిగతా నిందితులు 14 మంది సకలముఖి బల్లభ, గుర్రాలు బుడో, నాగబంస నాగార్జున, పడాల ప్రసాద్, బాధ దిలీప్, నాగబంస రామస్వామి, లియారి సురేష్, నాగబంస రామకృష్ణ, సకలముఖి మాధవ్, నాగబంస సింహాద్రి, నాగబంస హరికృష్ణ, నాగబంస పద్మన్, నాగబంస రాధాకాంత, గురాలు గోపాల్‌లకు యావజ్జీవ కారాగార శిక్ష, ఒక్కొక్కరికీ రూ.10 వేల జరిమానా విధిస్తూ జిల్లా అదనపు జడ్జి ప్రదీప్ కుమార్ సామల్ తీర్పునిచ్చారు.

మలేరియాతో విద్యార్థి మృతి



జాక్సన్ మండంగి మృతదేహం

రాయగడ: జిల్లాలోని కొలనర సమితి భొయిముడ ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న జాక్సన్ మండంగి(9) అనే విద్యార్థి మలేరియాతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. జూలై 29వ తేదీన జాక్సన్ తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు 30వ తేదీన రేఖాపాదొరొలోని పీహెచ్‌సీకి చికిత్స కోసం తరలించారు. అనంతరం వ్యాధి తీవ్రత తగ్గకపోవడంతో విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు 31వ తేదీన కొలనారలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు వ్యాధి తీవ్రత బాగా పెరిగిందని, మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో ఈనెల 1వ తేదీన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అదేరోజు రాత్రి బరంపురం తరలిస్తుండగా మార్గమధ్యలో విద్యార్థి మృతి చెందాడు. కాగా మలేరియా వ్యాధి జిల్లాలో విజృంభిస్తుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ వ్యాధి బారినపడి ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు.

ధాన్యం విక్రయాలకు ప్రచార రథం

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో 2024-25 ఏడాదికి గాను ఖరీఫ్ ధాన్యం సేకరణకు ప్రచార రథాన్ని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, ఏడీఎం రాజేంద్ర మింజీలు శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ ప్రచార రథం ఆగస్టు 31 వరకు జిల్లాలోని గుమ్మా, కాశీనగర్, గుసాని, రాయఘడ సమితిల్లో పర్యటిస్తుంది. రైతులు తమ పట్టా జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్, కౌలు రైతులైతే అసలు రైతుల ఒప్పంద పత్రం దరఖాస్తు నింపి అందజేయాలని సూచించారు. ధాన్యం అమ్మకాలకు సంబంధించి ఇప్పటివరకు 4 వేల మంది రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రఫుల్ల కుమార్ బెహరా, డిప్యూటీ కలెక్టర్ లిపినా దాస్, ఆర్ఎంసీఎస్ డిప్యూటీ రిజిస్ట్రార్ హరిహర సెఠి, నారాయణ సెఠి తదితరులు పాల్గొన్నారు.



ప్రచార రథం ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రధాన్

నియామకాల్లో నిబంధనలకు పాతర

అరసవల్లి: విద్యుత్ శాఖ శ్రీకాకుళం డివిజన్‌లో ఇటీవల ఆరుగురు అసిస్టెంట్ లైన్‌మేన్లకు లైన్‌మేన్లుగా పదోన్నతులు కల్పిస్తూ కేటాయించిన స్థానాల అంశంలో అధికారులు పూర్తిగా నిబంధనలకు పాతర వేశారని వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం ఆరోపించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రూరల్ ప్రాంతాల్లో పదేళ్లకు పైగా పనిచేసిన ఏఎల్ఎంలకు లైన్‌మేన్లుగా మళ్లీ రూరల్ ప్రాంతాలకే కేటాయించడాన్ని సంఘం రీజనల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైశ్యరాజు శ్రీనివాసరాజు, ఆర్.శ్రీనివాస్‌లు తీవ్రంగా తప్పుపట్టారు. డివిజన్ డీపీసీ చైర్మన్‌గా వ్యవహరించిన ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడు తీసుకున్న నిర్ణయాలపై తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నట్టు ప్రకటించారు. డీ-2 సెక్షన్‌లో పనిచేసిన ఏఎల్ఎంకు మళ్లీ డీ-2లోనే లైన్‌మేన్‌గా అవకాశమివ్వం ఏంటని ప్రశ్నించారు. ఎక్కువ కాలం రూరల్ ప్రాంతాల్లో పనిచేసిన వారికి పట్టణ ప్రాంతాలను కేటాయించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కిరాణా దుకాణం దగ్ధం

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామ సచివాలయం సమీపంలో ఉన్న కిరాణా దుకాణం గురువారం అర్ధరాత్రి దగ్ధమైంది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో చాలా వరకు సామగ్రి కాలిపోయింది. స్థానికులు స్పందించి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. విద్యుత్ షార్టు షర్క్యూట్ వల్ల జరిగిందా, ఇతర కారణాల వల్లా అన్నది తెలియరాలేదు. దుకాణ యజమాని సీపాన హైమావతి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.



కాలిపోయిన బడ్డీ

ఓపెన్‌గా చదువుకుందాం

- ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- వయస్సుతో నిమిత్తం లేకుండా టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆగస్ట్ 27 వరకు అవకాశం



ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఓపెన్ స్కూల్(సార్వత్రిక విద్యాపీఠం) నోటిఫికేషన్ విడుదలైంది. చదువుకోవాలని ఆసక్తి ఉండి అవకాశాలు లేక, కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక, రోజువారి స్కూల్/కాలేజీకి వెళ్లలేక.. ఇలా కారణమేదైనా విద్యకు దూరమైన వారికి బాసటగా నిలుస్తోంది ఓపెన్ స్కూల్. సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నామమాత్రపు ఫీజుతో ఏపీ ఓపెన్ స్కూల్ దూరవిద్యను అందిస్తోంది. రెగ్యులర్ చదువుతో సమానమైన విద్యను వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ చదువుకునేలా సర్కారు ప్రోత్సహిస్తోంది.

అర్హులు వీరే..

రెగ్యులర్ విధానంలో పదో తరగతి, ఇంటర్ ఫెయిలైన వారు, వివిధ కారణాలతో మధ్యలో చదువు ఆపేసిన వారు, తక్కువ విద్యార్హతతో ఏళ్ల తరబడి చిరుద్యోగం చేస్తున్న వారు, వ్యాపారులు, బాలికలు, గృహిణులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, ఆయాలు, దిగువ స్థాయి ప్రజాప్రతినిధులు ఇలా ఎవరైనా చేరవచ్చు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 14 ఏళ్ల వయస్సు నిండిన అభ్యర్థులు పదో తరగతిలో ప్రవేశానికి అర్హులు. 15 ఏళ్లు పూర్తయి.. పదో తరగతి పాసైనవారు, ఇంటర్ మధ్యలో ఆపేసినవారు/ఫెయిలైనవారు ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో దూర విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండేది. ప్రస్తుతం సమీపంలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో చదువుకోవచ్చు. రెండేళ్ల ఇంటర్ విద్య అయినా, పదోతరగతైనా ఏడాదిలోనే పూర్తి చేసుకోవచ్చు.

నోటిఫికేషన్ విడుదల..

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించింది. దరఖాస్తులు ప్రక్రియ జూలై 31న మొదలైంది. సమీపంలోని ప్రభుత్వ స్టడీ సెంటర్ దగ్గర వద్ద గానీ, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓపెన్‌స్కూల్.ఓఆర్జీ వెబ్‌పోర్టల్‌లో గానీ ఆగస్ట్ 27లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.200 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 4వ తేదీ వరకు చెల్లించవచ్చు.

రెగ్యులర్ సర్టిఫికెట్‌తో సమానం

ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్‌కు విలువ ఉంటుందో లేదోననే అపోహ చాలా మందిలో ఉంది. అది పూర్తిగా అవాస్తవం. ఓపెన్ స్కూల్ ద్వారా చదువుకున్న విద్య రెగ్యులర్ విద్యతో సమానమే. ఓపెన్ స్కూల్ సొసైటీ జారీ చేసే ఉత్తీర్ణత సర్టిఫికెట్లు సాధారణ పాఠశాల విద్య, కళాశాల విద్య సర్టిఫికెట్లతో సమానం. వీటితో ఉన్నత విద్యకు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని విద్యాశాఖాధికారులు, యూనివర్సిటీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పాస్ సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు నేరుగా అభ్యర్థుల చిరునామాకే పంపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.


ఇదీ పరిస్థితి..

- జిల్లాలో ఎస్ఎస్‌సీకి 47 స్టడీ సెంటర్లు, ఇంటర్మీడియెట్‌కు 28 స్టడీ సెంటర్లు ఉన్నాయి.
- దాదాపు ప్రతి మండలంలో అధ్యయన కేంద్రాలు ఉన్నాయి.
- ఆసక్తి గల వారికి ప్రవేశాలు కల్పించి ప్రతి ఆదివారం తరగతులు నిర్వహిస్తోంది.
- అభ్యర్థులకు ఎంచుకున్న మీడియం ప్రకారం పాఠ్యపుస్తకాలను, మెటీరియల్స్ అందజేయనున్నారు.
- అడ్మిషన్ పొందిన వారు 30 తరగతులకు కచ్చితంగా హాజరు కావాలి. అలా అయితేనే పరీక్ష రాసేందుకు అర్హత కల్పిస్తారు.
- అడ్మిషన్ పొందిన వారికి ఉత్తీర్ణత సాధించేందుకు ఐదేళ్ల వరకు అవకాశం ఇస్తారు.
- టెన్త్, ఇంటర్ కోర్సుల్లో చేరాలనుకునే వారు తెలుగు, ఇంగ్లీషుతోపాటు ఇతర మీడియంలలో కూడా కోర్సులు పూర్తి చేసుకునే అవకాశం ఉంది.
- ఇంటర్లో సైన్స్ ఎంపీసీ, బైపీసీ, ఆర్ట్స్ సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ ఇతరత్ర గ్రూపులు అందుబాటులో ఉన్నాయి.
- ఓపెన్ స్కూల్ సొసైటీ సమాచారం తెలియజేసేందుకు, పాఠాల కోసం 'జ్ఞానధార' పేరిట ప్రత్యేక యూట్యూబ్ చానెల్‌ను గత ప్రభుత్వం ప్రారంభించింది.

బాలికా విద్యకు ప్రోత్సాహం..

బాలికా విద్యను ప్రోత్సహించేలా ఓపెన్ స్కూల్ సొసైటీ అనేక చర్యలు తీసుకుంటోంది. ఆర్థిక కారణాలు, సమీపంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్య అందుబాటులో లేక వేలాది మంది బాలికలు, గృహిణులు ఉన్నత చదువులకు దూరమయ్యారు. అలాంటి వారికి ఫీజులో రాయితీ కల్పిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు, మాజీ సైనికుల పిల్లలకు కూడా ప్రవేశ రుసుం ఫీజులో రాయితీ కల్పిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



వివిధ కారణాలతో చదువు మధ్యలో ఆపేసినవారికి ఓపెన్ స్కూల్ వరం లాంటిది. టెన్త్, ఇంటర్ పూర్తి చేయడానికి మంచి అవకాశం. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ రెగ్యులర్ విద్య సర్టిఫికెట్‌తో సమానం. ఈ విషయంలో ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు. ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చొరవ తీసుకుని చదువుకు దూరమైన వారు ప్రవేశాలు పొందేలా చూడాలి.

– ఎస్.తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖాధికారి, శ్రీకాకుళం

రైతులకు ఉచితంగా విత్తనాల పంపిణీ

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్ సమితి పరిధి డంగసొరడ, కురుమజొడి, బొరిఖాల్, టురిగుడ, కరలకొన, డెలపడ గ్రామాల్లో గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలోని ఐటీడీఏ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలు, ఎరువులను శుక్రవారం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జీవికా మిషన్ పథకంలో భాగంగా ఉచితంగా వీటిని రైతులకు అందించారు. ఈ సందర్భంగా జీవికా మిషన్ అధికారి ప్రీతం రావుల్ మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడులతో పాటు నాణ్యత కలిగిన కూరగాయలు దిగుబడి అవుతాయన్నారు. అధిక శాతం ఎరువులను వినియోగిస్తే దిగుబడి తగ్గడంతో పాటు ఉత్పత్తుల్లో నాణ్యత లోపిస్తుందని పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడులు అందించే కూరగాయల సాగుపై రైతులు దృష్టిసారించాలని సూచించారు. మార్కెట్‌లో మంచి గిరాకీ ఉన్న కూరగాయల పంటల వలన రైతుల ఆర్థిక, సామాజిక రంగాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

'సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి'



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రాయగడ: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా డెంగీ, మలేరియా, సికిల్‌సెల్ వ్యాధులపై తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లాలోని కల్యాణ సింగుపూర్ పీహెచ్‌సీ వైద్యులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సమితిలోని కొరప పంచాయతీ విజయనగర్‌లోని ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులతో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వ్యాధులు సోకకుండా దోమ తెరలను వినియోగించాలన్నారు. డాక్టర్ సౌమ్యరంజన్ జెన్న నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దోమ తెరల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మౌలిక సదుపాయాల సమీక్ష



స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం సన్నాహాలు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర స్టీరింగ్ కమిటీ 62వ సమావేశం శుక్రవారం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ అహుజా అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఆరోగ్యం, వ్యవసాయం, అటవీ, పర్యావరణం, నైపుణ్యాభివృద్ధి మరియు వృత్తి విద్య వంటి వివిధ శాఖల మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టుల కార్యాచరణను ఈ సమావేశంలో సమీక్షించారు.

అగ్నివీర్ వాయు ఉద్యోగాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సెట్‌శ్రీ సీఈఓ బి.వి.ప్రసాదరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: అగ్నివీర్ వాయు ఉద్యోగాలపై యువత అవగాహన కలిగి ఉండాలని సెట్‌శ్రీ సీఈఓ బి.వి.ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం బలగలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ/డీఎల్‌టీసీ శిక్షణా సంస్థల్లో యువతీ యువకులకు అగ్నివీర్ వాయు ఉద్యోగాలపై శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి శిక్షణ శిబిరాలు నిర్వహించారు. యువజన సర్వీసుల శాఖ సెట్‌శ్రీ, జిల్లా ఉపాధి శిక్షణ సంస్థ, కళాశాలల ఆధ్వర్యంలో జరిగిన సదస్సుల్లో సెట్‌శ్రీ సీఈఓ మాట్లాడుతూ 17 సంవత్సరాల ఆరు నెలల నుంచి 21 ఏళ్లలోపు యువతీ యువకులు అగ్నివీర్ వాయుసేనలో చేరేందుకు అర్హులని చెప్పారు. అనంతరం ఎయిర్ ఫోర్స్ రిక్రూటింగ్ అధికారులు, రిక్రూటింగ్ స్టాఫ్ కార్పొరేల్ ఎస్.సందీప్, దేవ్‌కాంత్ మిశ్రా, డిఫెన్స్ సివిలయన్ నర్సింగ్ యాదవ్ యువతకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కాగా, శనివారం శ్రీకాకుళం రూరల్ మండలం మునసబ్‌పేటలో ఉన్న గురజాడ గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, నరసన్నపేట, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని సీఈఓ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ వై.పోలినాయుడు, జిల్లా ఉపాధి కల్పనాధికారి కొత్తలంక సుధ, ఎన్‌వైకె యూత్ కోఆర్డినేటర్ కె.వెంకట్‌ఉజ్వల్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు కీలకం



మాట్లాడుతున్న పెరియా జాగృతి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలంటే నైపుణ్యాలు కీలకమని వ్యక్తిత్వ వికాస నిపుణురాలు పెరియా జాగృతి అన్నారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం కెరీర్ గైడెన్స్ అన్న అంశంపై నిర్వహించిన ప్రత్యేక సదస్సులో మాట్లాడారు. నాలుగేళ్ల ఇంజినీరింగ్ అనంతరం ఉన్నత ప్లేస్‌మెంట్, ఉన్నత విద్య లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఆత్మ విశ్వాసం, అనుకూల దృక్పథం ఉండాలన్నారు. ఇంజినీరింగ్‌లో అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్ వంటి అంశాలపై పట్టు ఉండాలన్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పరీక్షలకు సన్నద్ధం కావటం వల్ల మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ సభ్యులు పి.దుర్గాప్రసాద్‌రాజు, డి.వెంకటరావు, ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జి.టి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మిడత.. అద్భుతః



పలాస మండలం తర్లాకోటలో పురాతన కోట సమీపంలో ఓ మిడత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రకృతిలో మిళితమై అద్భుతమైన రంగులతో ఆకట్టుకుంది. ఇక్కడ పచ్చదనం ఎక్కువగా ఉండటంతో విభిన్నమైన జీవరాశులకు ఈ ప్రాంతం నెలవుగా మారింది.

– కాశీబుగ్గ

క్లుప్తంగా

నాణ్యమైన కూరగాయలు సరఫరా చేయండి

● ఐటీడీఏ పీవో రాహుల్‌కుమార్ రెడ్డి



సీల్డ్ టెండర్‌ను ఓపెన్ చేస్తున్న పీవో రాహుల్‌కుమార్ రెడ్డి

సీతంపేట: ఐటీడీఏ పరిధిలో గిరిజన గురుకులాలకు నాణ్యమైన కూరగాయలు సరఫరా చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలు, మినీగురుకులాలు, ఏకలవ్య మోడల్ స్కూల్స్‌కు కూరగాయలు, చికెన్ సరఫరాకు టెండర్లు నిర్వహించారు. అధికారులు, టెండర్‌దారుల సమక్షంలో సీల్డు టెండర్లు ఓపెన్ చేశారు. తక్కువ ధరలకు కోట్ చేసిన వారికి కాంట్రాక్ట్ కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. ఇటు ఐటీడీఏకు అటు మీకు నష్టం కలగకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నాదొర, ఏపీవో గణేష్, డిప్యూటీ ఈవో పి.నారాయుడు, ఏటీడబ్ల్యూవో మంగవేణి, ప్రిన్సిపాల్స్ పి.సూర్యకుమారి, పీవీ రామారావు, తిరుపతిరాజు, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓపై విచారణ

● ఆర్‌జేడీకి యూటీఎఫ్ నాయకుల ఫిర్యాదు

గరుగుబిల్లి: గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల ఎంఈఓ-1 ఎస్.నాగభూషణరావుపై వచ్చిన అవినీతి ఆరోపణల ఫిర్యాదు నేపథ్యంలో పాలకొండ డిప్యూటీ డీఈఓ పి.కృష్ణమూర్తి శుక్రవారం గరుగుబిల్లి ఎంఆర్‌సీలో విచారణ చేపట్టారు. ఎంఈఓ-1 పలు అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ కలెక్టర్, ఆర్‌జేడీకి యూటీఎఫ్ జిల్లాశాఖ ఫిర్యాదులు అందజేసింది. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో ఎంఈఓ-1పై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్ రావులు మాట్లాడుతూ ఎంఈఓ ప్రతి పనికి ఉపాధ్యాయులనుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎస్ఎంఎస్ గ్రాంట్స్, నాడు-నేడు పనుల్లో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్నారు. అక్రమాలపై ఆధారాలతో విచారణాధికారి డిప్యూటీ డీఈఓ కృష్ణమూర్తికి సమర్పించామని, ఎంఈఓపై చర్యలు చేపట్టాలని కోరినట్లు చెప్పారు. అవినీతి ఆరోపణలపై విచారణ చేశామని, తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు డిప్యూటీ డీఈఓ తెలిపారు. విచారణలో పార్వతీపురం ఎంఈఓ-2 కె.ప్రసాద్ ఉన్నారు.

15 తులాల బంగారం చోరీ



దొంగతనం జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న ఎస్సై జయంతి, క్లూస్‌టీం

రామభద్రపురం: మండలకేంద్రంలోని శ్రీరాం నగర్ కాలనీలో గురువారం అర్ధరాత్రి ఓ ఇంట్లో దొంగలు చొరబడి బంగారం,వెండి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన పప్పు ఈశ్వరరావు, సరోజిని దంపతులు తమ కుమారుడు రాంబాబును ఇంటి దగ్గర వదిలేసి ఇటీవల తిరుపతి తీర్థయాత్రకు వెళ్లారు. అయితే ఇదే మండలంలోని బూశాయవలస తమ బంధువుల ఇంటికి రాంబాబు గురువారం సాయంత్రం వెళ్లాడు. ఈ విషయం గమనించిన దొంగలు ఇంటి తలుపులు పగలుకొట్టి లోపలికి చొరబడి బీరువా పగలగొట్టి లోపల ఉన్న 15 తులాల బంగారం వస్తువులు, 450 గ్రాముల వెండి వస్తువులు, రూ.22 వేల నగదు చోరీచేశారు. శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో రాంబాబు ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. అలాగే బీరువా తెరిచి ఉండడంతో పాటు అందులో ఉండాల్సిన బంగారం వెండి వస్తువులు ఉన్న బాక్సు ఇంట్లోని మంచంపై చెల్లాచెదురుగా పడి ఉండడంతో ఆందోళనకు గురై చుట్టుపక్కలవారితో పాటు ఊరిలో ఉన్న బంధువులకు తెలియజేశాడు. దీంతో వారంతా వచ్చి పరిశీలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎస్సై జయంతి, ఏఎస్సై అప్పారావులు సంఘటన స్థలంలో పరిశీలించిన అనంతరం క్లూస్‌టీమ్‌కు సమాచారం ఇచ్చి రప్పించారు. రాంబాబు ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఆర్.అప్పారావు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

రెండు క్వారీలు సీజ్

భోగాపురం: మండలంలోని రామచంద్రపేట, కొండ్రాజుపాలెం గ్రామాలకు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెండు క్వారీలను అధికారులు సీజ్‌చేశారు. క్వారీల నిర్వహణ వల్ల ఇబ్బందులు పడుతున్నామంటూ ఇటీవల ఎమ్మెల్యే లోకం నాగమాధవికి స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఆమె అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీఓ సూర్యకళ, జిల్లా మైనింగ్ సర్వేయర్ ఎం.చల్లాలు, తహసీల్దార్ ఎం.సురేష్ శుక్రవారం రాత్రిక్వారీల వద్దకు చేరుకుని విచారణ జరిపి సీజ్ చేశారు.



ఎర్నాకులం రిజర్వేషన్ బోగీలో కిక్కిరిన ప్రయాణికులు



జనాలతో కిక్కిరిసిన ఎర్నాకులం రైలు

జనం ఉన్నా.. సౌకర్యాలు సున్నా

సాక్షి, పార్వతీపురం/పార్వతీపురంటౌన్: రైళ్లలో జనరల్ బోగీలు నరకానికి నకళ్లుగా మారాయి. కిక్కిరిసి న బోగీల్లో ఒకరిపై ఒకరు కూర్చుని, నిల్చుని ప్రయాణించడం సర్వ సాధారణంగా మారింది. వందల కిలోమీటర్ల దూరం నిలబడి ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో మహిళలు, పిల్లలు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతూ కేంద్రప్రభుత్వం తీ రుపై మండిపడుతున్నారు. ఏసీ కోచ్‌లు, వందే భార త్ రైళ్లపై ఉన్న శ్రద్ధ సామాన్యులు ప్రయాణించే జనరల్ బోగీల పైనా పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

పాసింజర్ రైళ్ల తగ్గింపు

ఒకప్పుడు పేదల బండిగా ఉన్న రైలు ఇప్పుడు వారికి అందని ద్రాక్షగా మారుతోంది. కేంద్రప్రభుత్వం ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్‌ఫాస్ట్, వందేభారత్ ప్రవేశపెట్టాక పాసింజర్ రైళ్లను తగ్గించేయడమే కాకుండా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను కాలక్రమేణా కుదిస్తూ వస్తోంది. ప్రయాణికులకు సౌకర్యాలు పెంచుతున్నామంటూనే రైలు ప్రయాణాన్ని పేదలకు దూరం చేస్తోంది. ఈ మేరకు వామపక్ష నాయకులు ధర్నాలు, స్టేషన్‌లలో వినతి పత్రాలు అందిస్తున్నప్పటికీ ఫలితం శూన్యంగా ఉంది.



పార్వతీపురం రైల్వేస్టేషన్‌లో రైలు పునరుద్ధరణపై వినతి పత్రం అందిస్తున్న వామపక్ష నాయకులు (ఫైల్)

ఉత్తరాంధ్ర రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు రైలుకు కలగని మోక్షం

సాధారణ, మధ్యతరగతి ప్రయాణికులు జిల్లా నుంచి విజయవాడకు వెళ్లేందుకు వీలుగా ఉండే రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు ఉత్తరాంధ్ర రాజధాని ఎక్స్‌ప్రెస్‌గా పేరుగాంచింది. ప్రయాణికులందరికీ అందుబాటులో ఉండే ఈరైలు సర్వీసులను ఆరు నెలలుగా నిలిపివేశారు. జిల్లా నుంచి రాజమండ్రి, విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాలకు పనుల కోసం కుటుంబాలతో వలస వెళ్లే ప్రయాణికులకు ఈ రైలు అందరికీ వెసులుబాటుగా ఉండేది. ఈ రైలు ఎప్పుడు ప్రారంభిస్తారా? అని ఈ ప్రాంత వాసులు వెయ్యికళ్లతో ఎదురు చూస్తున్నారు. ఈ రైలు రద్దు కావడంతో ఎర్నాకులం, అలెప్పీ-ధన్‌బాద్ వంటి ఇతర రైళ్లపై ఆధార పడుతున్నారు. ఫలితంగా ఆ సర్వీసులన్నీ కిక్కిరిసిపోతున్నాయి.

కేవలం రెండే జనరల్ బోగీలు..
జిల్లా పరిధిలో ప్రధానంగా పార్వతీపురం, గుమడ, కూనేరు, జిమిడిపేట రైల్వేస్టేషన్ల మీదుగా వెళ్లే రైళ్లు అధికంగా ఉన్నాయి. 15 ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రతి రైలులో కేవలం రెండే రెండు జనరల్ బోగీలు ఉంటున్నాయి. ఏళ్ల తరబడి ఇదే దుస్థితి. ప్రయాణికుల రద్దీ కనుగుణంగా రైల్వే శాఖ జనరల్ బోగీలు పెంచడం లేదు. సాధారణ ప్రయాణికులు కనీసం నిలబడేందుకు కూడా ఆ బోగీల్లో స్థలం ఉండడం లేదు. తాగునీటి వసతి సరిగా ఉండదు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉంటున్నాయి.

ఉద్యోగులకు ఇబ్బందులే..

విజయనగరం నుంచి బొబ్బిలి-పార్వతీపురం వరకు నిత్యం వందలాది మంది ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నారు. విజయనగరం నుంచి రావాలంటే వీరికి ఉదయం వేళ కొరాపుట్ డీఎంయూ, రాయపూర్ పాసింజర్ రైళ్లే దిక్కు. సాయంత్రం వేళ విధులు ముగించుకుని వెళ్లే సమయానికి ఒక రైలు కూడా అందుబాటులో లేదు. సాయంత్రం 6గంటల సమయంలో ఎర్నాకులం రైలు ఉన్నప్పటికీ దాని స్లీపర్, జనరల్ బోగీలను దక్కించడంతో మొత్తం ప్రయాణికుల తాకిడంతా ఈ రైలు మీదే పడుతుంది. రిజర్వేషన్ బోగీలు సైతం ప్రయాణికులతో కిక్కిరిసిపోయి టాయ్‌లెట్స్ వద్ద కూర్చుని ప్రయాణం సాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు సాయంత్రం 4గంటల సమయంలో పార్వతీపురం వచ్చేది. పార్వతీపురం, బొబ్బిలి నుంచి వెళ్లే ఉద్యోగులకు ఇది ఉపయోగకరంగా ఉండేది. కొన్ని నెలలుగా ఆ రైలు సర్వీసులు నిలిపివేయడంతో సాధారణ ప్రయాణికులతో పాటు ఉద్యోగవర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి.

సమస్యలు పరిష్కరించాలి



ప్రతిరోజూ వ్యాపార కేంద్రం విజయనగరం నుంచి పార్వతీపురం ప్రయాణం చేస్తున్నాను. జనరల్ బోగీలో ప్రయాణం నరకంగా ఉంటోంది. అక్కడ విపరీతమైన రద్దీ ఉంటున్నప్పటికీ ఇబ్బందులు పడుతూనే ఎలాగోలా ప్రయాణం చేస్తున్నా. మా అవస్థలు అన్నీ ఇన్నీ కావు. రైలు ప్రయాణమంటేనే భయమేస్తోంది.
శ్రీనివాసరావు, ప్రయాణికుడు

గుంటూరు రాయగడ రైలుకు కలగని మోక్షం
జిల్లాలో ప్రతిరోజూ ప్రయాణించే రైళ్లు 9, స్పెషల్ రైళ్లు 9

జనరల్ బోగీలు పెంచాలి



విశాఖపట్నం నుంచి పార్వతీపురం ప్రయాణించాం. అలెప్పీ ధన్‌బాద్ రైలుకు రిజర్వేషన్ చేయించుకున్నా సీటు కన్ఫర్మ్ కాకపోవడంతో జనరల్ బోగీలో వచ్చాం. విపరీతమైన రద్దీ ఉంది. నిల్చోవడానికి కాళ్లు కింద పెట్టాలన్నా కుదర్లేదు. ఒంటి కాలిపైనే ప్రయాణించాం. జనరల్‌లో రెండు బోగీలే ఉండడంతో అవస్థలు పడ్డాం. బోగీలను పెంచాలి.
– ఉమా మహేశ్వరరావు, ప్రయాణికుడు

కేంద్ర ప్రభుత్వం తీరు అన్యాయం



సామాన్యులకు రైలు ప్రయాణాన్ని దూరం చేసేలా తీసుకుంటున్న నిర్ణయాలను కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. స్లీపర్ కోచ్, ఏసీ కోచ్‌ల ధరలు అందని ద్రాక్షలా మారాయి. ప్లాట్‌ఫాం పొడవు లేదని బోగీలను పెంచకపోవడం సరికాదు. దశాబ్దాల తరబడి రెండు జనరల్ బోగీలనే కొనసాగిస్తుండడం అన్యాయం.
పి.సంఘం, సీపీఐఎంల్ లిబరేషన్, జిల్లా కన్వీనర్

చదువు కొనసాగించేందుకు ఓపెన్ స్కూల్



ప్రచార పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

● 27వ తేదీ లోగా రిజిస్టర్ చేసుకోవాలి
● కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఓపెన్ స్కూల్ ద్వారా విద్యాభ్యాసాన్ని కొనసాగించేలా చూడాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరారు. చదువుకోడానికి సార్వత్రిక విద్య చక్కని అవకాశమని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న వారంతా పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ పరీక్షలను ఓపెన్ స్కూల్ ద్వారా రాసి అర్ధాంతరంగా ఆగిపోయిన వారి చదువును కొనసాగించవచ్చని సూచించారు. ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై తన చాంబర్‌లో కలెక్టర్ అంబేడ్కర్ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఓపెన్ స్కూల్ గురించి డీఈఓ ఎన్.ప్రేమకుమార్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ ఎటువంటి విద్యార్హతలు లేని వారు చదువును మధ్యలో వదిలేసిన వారు నేరుగా పదోతరగతి పరీక్షలకు హాజరయ్యేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఒక చక్కని మార్గమన్నారు. ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాలు నిండేవారంతా పరీక్షలకు హాజరు కావచ్చునని తెలిపారు. పదోతరగతి లేదా ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరు కావాలనుకునే వారు ఈ నెల 27వ తేదీలోగా వారి పేర్లను ఆన్‌లైన్‌లో లేదా ఎంఈఓ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పదోతరగతి పరీక్షలకు హాజరుకావాలనుకునే వారు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100, ఇంటర్ పరీక్షలకు రూ.200 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పదోతరగతికి హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, మహిళలు రూ.900 ఫీజు, ఇతరులు రూ.1,300 చెల్లించాలని తెలిపారు. అలాగే ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, మహిళలు రూ.1,100, ఇతరులు రూ.1,400 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నెల 27వ తరువాత నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు రూ.200 అపరాధ రుసుంతో ఫీజులు చెల్లించవచ్చని స్పష్టం చేశారు. అనంతరం ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ అంబేడ్కర్ విడుదల చేశారు. సమావేశంలో డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్, జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవ ,మెప్మా పీడీ సుధాకరరావు, డ్వామా పీడీ జి.ఉమాపరవేశ్వరి, ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ, డీవీఈఓ ఎస్.భీమశంకర్, డీసీఎల్ సుబ్రహ్మణ్యం, డైట్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.తిరుపతినాయుడు, అసిస్టెంట్ కంట్రోలర్ టి.సన్యాసి రాజు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ బాధితులకు ఆర్థిక భరోసా

● ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు

పార్వతీపురం: హిట్ అండ్ రన్ (గుర్తు తెలియని వాహనాలు ఢీ కొన్న) కేసుల్లో బాధితులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రెవెన్యూ, పోలీసు అధికారులు, బాధితులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హిట్ అండ్ రన్ కేసుల్లో మరణించిన వారి కుటుంబసభ్యులకు రూ.2 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50వేలు పరిహారం అందించనున్నట్లు తెలిపారు. గుర్తు తెలియని వాహనాలు ఢీ కొన్న సంఘటనలో బాధితులు పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్లెయిమ్ చేసుకునే విధానంపై ఈ సందర్భంగా తెలియజేశారు. తరువాత వాహనం గుర్తిస్తే ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి కూడా పరిహారం పొందవచ్చన్నారు. చాలామంది బాధితులు ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసేందుకు వీలుపడదనే ఉద్దేశంతో హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు కేంద్రప్రభుత్వం అందించే పరిహారం క్లెయిమ్ చేసుకునేందుకు ముందుకురావడం లేదని, ఇన్సూరెన్స్ క్లెయిమ్‌కు, ప్రస్తుతం అందిస్తున్న పరిహారానికి సంబంధం లేదని కావున హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులందరూ ఈ పరిహారం పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు కె.హేమలత, వీవీ.రమణ, చినమేరంగి సీఐ బి.మంగరాజు, పార్వతీపురం టౌన్ ఎస్సైలు కె.ప్రయోగ మూర్తి, బి.సంతోషి తదితరులు పాల్గొన్నారు. హిట్ అండ్ రన్ కేసులో చనిపోయిన కొమరాడ మండలం కోటిపాం గ్రామానికి చెందిన వేసముల ప్రశాంతి కుటుంబసభ్యులు, పార్వతీపురం పట్టణంలోని వైకేఎం కాలనీకి చెందిన చందక సూర్యప్రకాశ్ భార్య రాజేశ్వరి పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న డీఆర్ఓ కేశవనాయుడు

గ్రామసచివాలయంలో చోరీ



గ్రామ సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

రేగిడి: మండల పరిధిలోని తోకలవలస గ్రామ సచివాలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. దీనిపై ఎస్సై ఇ.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ సచివాలయం తలుపుల తాళాలు పగలగొట్టి లోపలకు ప్రవేశించి బీరువాలను తెరిచి అందులో ఉన్న సెల్‌ఫోన్‌లు దొంగిలించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి రాకేష్‌కుమార్ శుక్రవారం ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

అక్రమ రవాణా నియంత్రణకు వాహనాల తనిఖీ

● ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు

విజయనగరం క్రైమ్:

జిల్లాలో గంజాయి, మద్యం, సారా, పశువుల అక్రమ రవాణాను నియంత్రించడంలో భాగంగా ఆగస్టు ఒకటో తేదీ నుంచి వారం రోజుల పాటు కొన్ని గుర్తించిన ప్రాంతాల్లో డైనమిక్ వాహన తనిఖీలు చేపట్టాలని పోలీస్ అధికారులకు ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు సమయాల్లో వాహన తనిఖీలు చేపట్టాలని చెప్పారు. ఈ తనిఖీల్లో ఎస్సై స్థాయి అధికారి తప్పనిసరిగా ఉండాలని, వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, తనిఖీ చేసిన వాహనాల వివరాలను నమోదుచేయాలని స్పష్టం చేశారు. అలవాటుగా వాహన తనిఖీలు చేపట్టే ప్రాంతాలకు, సమయాలకు స్వస్తి పలకాలని చెప్పారు. ముఖ్యంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలపై దృష్టిపెట్టాలని, ఆయా వాహనాలను అధికారులు, సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెప్పారు. డైనమిక్ వాహన తనిఖీలకు సంబంధించి ప్రణాళిక రూపొందించి, షెడ్యూల్ విడుదల చేశారు. వాహన తనిఖీలను సంబంధిత డీఎస్పీలు, సీఐలు పర్యవేక్షించాలంటూ ఆదేశాలు జారీచేశారు.



వాహన తనిఖీలు చేపడుతున్న పోలీస్ అధికారులు

పాముకాటుతో యువకుడి మృతి



సుధీర్ మృతదేహం

బొబ్బిలిరూరల్: మండలంలోని చింతాడ గ్రామంలో పాముకాటుకు గురై ఓ యువకుడు మృతిచెందాడు. శుక్రవారం ఉదయం ఇంటి వెనుక ఉన్న కళ్లానికి వెళ్లిన గ్రామానికి చెందిన తోడబండి సుధీర్(27)ను పాము కాటు వేసింది. ఏదో పురుగు కరిచి ఉంటుందని భావించి రక్తమోడుతున్న కాలిగాయాన్ని అక్కడున్న చెరువులో కడుక్కుని గట్టుపైన ఉన్న స్నేహితులతో పిచ్చాపాటి మాట్లాడుతుండగా కాస్త కాలువాపు, నొప్పి అనిపించడంతో స్నేహితులకు చెప్పి బొబ్బిలి ఆస్పత్రికి వెళ్దామని బయలుదేరాడు. అయితే అప్పటికే విషం శరీరమంతా వ్యాపించడంతో పరిస్థితి విషమించి మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచాడు.దీంతో విషయం తెలుసుకున్న మృతుడి తండ్రి పోలినాయుడు, తల్లి సత్యవతి, సోదరి భోరున విలపించారు. చేతికి అందివచ్చిన ఒక్కగానొక్క కొడుకు చిన్నవయసులోనే దూరం కావడంతో గుండెలవిసేలా విలపించారు. ఇంజినీరింగ్ చదువుకున్న సుధీర్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేసేవాడని, కరోనా సమయంలో స్వగ్రామం వచ్చి ఇక్కడే తల్లిదండ్రులతో వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉంటున్నాడని గ్రామస్తులు చెబుతూ కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బేబీనాయన యువకుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నీటి గుంతలో పడి కలాసీ..



రేగిడి : కలాసీ రాంబాబు మృతదేహం

రేగిడి: మండలంలోని ఆమదాలవలస కాలనీకి చెందిన కలాసీ కుమిలి రాంబాబు(35) నీటి గుంతలో పడి శుక్రవారం మృతిచెందాడు. దీనిపై ఎస్సై ఇ.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంబాబు రేగిడి పౌరసరఫరాల గోదాంలో కలాసీగా విధులు నిర్వహిస్తున్నాడు. తన ఇంటి వద్ద భోజనం అనంతరం చిన్నశిర్లాంలో గల అత్త వారింటికి వెళ్లి భార్యాపిల్లలను కలిసిన తరువాత తిరుగుప్రయాణమయ్యాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రాంబాబు చిన్నశిర్లాం ప్రధాన రహదారి జంక్షన్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న నీటి గుంతలో పడిపోయాడు. ఈ విషయం గమనించిన స్థానికులు గమనించి బయటకు తీసేలోగానే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి ఆరాతీశారు. మృతుడికి భార్య సంతోషి, కుమార్తె పూజిత ఉన్నారు. భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడు..

లక్కవరపుకోట: అరకు-విశాఖ రోడ్డులో లక్కవరపు కోట మండలంలోని సంతపేట జంక్షన్ సమీపంలో శుక్రవారం ఉదయం నడుచుకుంటూ వెళ్తున్న జి.లక్ష్మణ (69) అనే వృద్ధుడిని అదుపుతప్పిన ద్విచక్రవాహనం వెనుకనుంచి ఢీకొనడంతో మృతి చెందాడు. దీనిపై ఎస్సై గోపాలరావు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు లక్ష్మణది అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం ముషిడిపల్లి గ్రామం. తన బంధువులు లక్కవరపుకోట మండలంలోని రంగారాయపురం గ్రామంలో ఉండడంతో అక్కడికి వచ్చి తిరిగి వెళ్తుండగా బైక్ ఢీకొట్టడంతో గాయాలపాలైన లక్ష్మణను విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

తైక్వాండో పోటీలకు జిల్లా జట్టు పయనం



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో అనంతపురంజిల్లాలోని తాడిపత్రిలో జరగనున్న తైక్వాండో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్టు శుక్రవారం పయనమైంది. ఈ నెల 3, 4 తేదీల్లో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, క్యాడెట్ తైక్వాండో పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి 38 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. వారికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావులు పలు సూచనలు, సలహాలు చేశారు. రాష్ట్రస్థాయిలో జరగనున్న పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభాపాటవాలు కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు కోచ్ అండ్ మేనేజర్‌లుగా ఎం.గగన్ సాగర్, కె.చైతన్యలు, రిఫరీగా కె.దీపిక వ్యవహరించనున్నారు.

లాడ్జిలో పట్టుబడిన 4 కిలోల బంగారం

● రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు



స్వాధీనం చేసుకున్న బంగారం

బొబ్బిలి: వివిధ పన్నులు, జీఎస్టీ చెల్లించకుండా పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలను తరలిస్తున్న ముఠాను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ మేరకు డీఎస్పీ పి.శ్రీనివాసరావు శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించిన సమాచారం ప్రకారం బొబ్బిలి పట్టణంలోని శ్రీ సూర్య లాడ్జిలోని 4వ నంబర్ రూమ్‌లో రాజస్థాన్‌కు చెందిన భవేష్ కుమావత్ , భారియా ఆనంద్ కుమార్‌లు బంగారంతో దిగినట్లు సీఐ ఎం.నాగేశ్వర రావుకు సమాచారం అందింది. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి సిబ్బందితో కలిసి సీఐ దాడి చేశారు. ఈ దాడిలో సుమారు నాలుగు కిలోల బంగారాన్ని వారి వద్ద ఉన్న రెండు ప్లాస్టిక్‌బాక్స్, కాటన్ సంచులతో ఉన్న బంగారాన్ని గుర్తించారు. అయితే వారి వద్ద వాటికి అవసరమైన బిల్లులు కానీ, ఏ విధమైన డాక్యుమెంట్లు కానీ లేవు. గుంటూరులోని పట్నం బజారులో ఉన్న శాంతి గోల్డ్ జ్యుయలరీ నుంచి ఆభరణాలు తీసుకువచ్చినట్లు పోలీసులకు వారు సమాధానం చెప్పారు. వారు చెప్పిన సమాధానం కరెక్ట్‌గా లేకపోవడంతో పోలీసులు బంగారాన్ని స్వాధీనం చేసుకుని, వారిద్దరినీ అరెస్టు చేశారు.

బిల్లులు లేకుండా విక్రయం
పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తులో 18 ఆకారాల్లో మొత్తం 535 ఆభరణాలు ఉన్నాయి. బిల్లులు లేకుండా పట్టణంలోని పలు బంగారు దుకాణాలకు వీరు తరచూ బంగారాన్ని విక్రయిస్తున్నట్లు తెలిసింది. బంగారాన్ని బిల్లులు లేకుండా విక్రయించడం వల్ల వర్తకులకు తక్కువ ధరకు లభిస్తోంది. ఇదే బంగారాన్ని అధిక ధరలకు వినియోగదారులకు విక్రయిస్తున్నారు. కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ పి శ్రీనివాసరావు, సీఐ ఎం.నాగేశ్వర రావు తెలిపారు.

ఉద్యోగాల్లో స్థానికుల సంఖ్యపై సర్వే

● కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలోని పరిశ్రమలు, వివిధ కర్మాగారాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో స్థానికుల సంఖ్యపై వారం రోజుల్లో సర్వే నిర్వహించి, నివేదికను సమర్పించాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఉద్యోగాల్లో 75 శాతం స్థానికులకే ఇవ్వాలన్న నిబంధన ఎంతవరకు అమలు జరుగుతుందో నిర్ధారించిన నివేదికను దేశ అత్యున్నత న్యాయ స్థానానికి అందజేయాల్సి ఉన్నందున వారంలో రోజుల్లో సర్వే పూర్తి చేయాలని సూచించారు. పరిశ్రమలు, కర్మాగారాల్లోని ఉద్యోగాల్లో స్థానికతపై వివిధ శాఖల అధికారులతో తన చాంబర్‌లో కలెక్టర్ అంబేడ్కర్ శక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఉన్న 196 కర్మాగారాల సంఖ్యపై సర్వే చేయాలని ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్‌ను, వివిధ పరిశ్రమల్లో ఉన్న ఉద్యోగుల సంఖ్యపై సర్వే చేయాలని జిల్లా పరిశ్రమల శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ, ఇండస్ట్రీ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ గణపతి, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గోవిందరావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.మురళీమోహన్, డీసీఎల్ సుబ్రమణ్యం, పరిశ్రమల శాఖ డీడీ నాగేశ్వరరావు, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి ఇతర అధికారులు పాల్గొన్నారు.